క్లుప్తంగా

నేడు మండల సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

140 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: సీతంపేట, దోనుబాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 140 లీటర్ల సారాను పట్టుకున్నట్టు పోలీసులు బుధవారం తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు 120 లీటర్ల సారా తరలిస్తుండగా.. వారిని పట్టుకుని సారా క్యాన్లు స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు దోనుబాయి ఎస్సై కిశోర్‌వర్మ తెలిపారు. అలాగే సారా విక్రయిస్తున్న సీతంపేటకు చెందిన ఓ వ్యక్తిని పట్టుకుని అతని వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీతంపేట ఎస్సై నీలకంఠరావు తెలిపారు.

వైద్య సేవలపై ఆరా



సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న వంశీప్రియ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సీహెచ్‌సీని కాయకల్ప బృంద సభ్యురాలు వంశీప్రియ బుధవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, నిర్వహణ, మందుల నిల్వలు, రోజువారీ ఓపీ, వైద్యుల హాజరు పట్టీలను పరిశీలించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఆస్పత్రిని పరిశీలించి ర్యాంకింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు డాక్టర్ ప్రతిమ, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగికి పరామర్శ



పరామర్శిస్తున్న గ్రామ కార్యదర్శులు

సీతంపేట: రెండు రోజుల కిందట రోడ్డుప్రమాదంలో గాయాలపాలై స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామ సచివాలయ ఉద్యోగి సంతోషిని మండల గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పాపారావు, సభ్యులు బుధవారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎండీయూ ఆపరేటర్ చేతివాటం



ఉచితంగా ఇస్తున్న బియ్యానికి డబ్బులు వసూలు చేశారని చెపుతున్న పెదకుదమ గ్రామస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని కుదమ పంచాయతీలో ఎండీయూ ఆపరేటర్ మిరియాల శంకరరావు చేతివాటం ప్రదర్శించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం జనవరి నెల రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించినప్పటికీ కిలోకు రూ.1 చొప్పున వసూలు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెదకుదమలో బుధవారం 120 కార్డులకు బియ్యం పంపిణీ చేసిన ఆయన లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశాడు. దీనిపై కొందరు గ్రామస్తులు ప్రశ్నించగా.. వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న సర్పంచ్ ఇందుమతి, తదితరులు

గరుగుబిల్లి: వైఎస్సార్‌టీఎఫ్ వార్షిక క్యాలెండర్‌ను గరుగుబిల్లి సర్పంచ్ కె.ఇందుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 42 నెలల్లో కురుపాం నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల కేటాయింపు, తదితర వివరాలను క్యాలెండర్‌లో పొందుపరిచినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పాలకొండ రూరల్: పట్టణంలోని రెల్లివీధికి చెందిన బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన యువకుడు బాలికను నమ్మించి మోసం చేసినట్లు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరివర్తనకు దోహదం

- భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలతో పాటు విద్యా బోధన
- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ



గుమ్మలక్ష్మీపురం నాన్ భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: పుట్టుకతో కొందరు.. పుట్టిన తర్వాత కొందరు.. అనారోగ్య కారణాలతో ఇంకొందరు చిన్నారులు దివ్యాంగులుగా మారుతున్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆయా మండల కేంద్రాల్లో భవిత, నాన్ భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా వారంలో ఒక రోజు దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తోంది. దీంతో పిల్లల్లో పరివర్తన కనిపిస్తోందంటూ పలువురు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

239 మంది దివ్యాంగ చిన్నారులు

పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. ఇందులో సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ మండలాల్లో భవిత కేంద్రాలు, మిగతా 11 మండలాల్లో నాన్ భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో మొత్తం 239 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సేవలందిస్తున్నారు. శారీరక, మానసిక, వినికిడి లోపం తదితర 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులకు వైద్య సేవలతో (ఫిజియోథెరపీ) పాటు విద్యను బోధిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు వారి రోజువారీ కార్యకలాపాలను వారే సొంతంగా చేసుకునేలా ఐఆర్‌టీలు శిక్షణ ఇస్తున్నారు. చదవడం, రాయడం వంటివి నేర్పిస్తున్నారు. శారీరక వైకల్యం ఉన్న వారికి వారంలో ఒక రోజు నిర్ణయించుకొని ఫిజియోథెరపీ చేస్తుండడంతో చిన్నారుల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. కేంద్రాలకు రాలేని చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఐఈఆర్‌టీలు విద్యాబోధన చేస్తున్నారు.

నడవగలుగుతున్నారు



నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ నడవలేని స్థితిలో ఉండగా.. గుమ్మలక్ష్మీపురం విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఆర్‌ఎస్ టీసీలో చేర్పించాం. అక్కడ అందిస్తున్న ఫిజియోథెరపీ వల్ల వారు నెమ్మది నెమ్మదిగా నడువగలుగుతున్నారు. ఫిజియోథెరపీ వల్ల మా పిల్లలిరువురికి ఎంతో మేలు చేకూరుతోంది.

– కొండగొర్రి సుక్కు,
టిక్కబాయి గ్రామం

శిక్షణతో ప్రయోజనం



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ విద్యార్థుల్లా తెలివితేటలు ఉన్నా ప్రదర్శించలేరు. వారి మానసిక స్థితిని అంచనా వేసి దానికి అనుగుణంగా బోధన అందిస్తున్నాం. దీని వలన వారు చదవడం, రాయడం నేర్చుకుంటున్నారు.

– ఎస్.పద్మావతి, ఐఈఆర్‌టీ,
గుమ్మలక్ష్మీపురం నాన్ భవిత కేంద్రం

వైకల్యాన్ని తగ్గించేందుకు కృషి



సహిత విద్య కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లల్లో వైకల్యాన్ని కాస్తయినా తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే వారంలో కనీసం రెండుసార్లు వైద్యులతో ఫిజియోథెరపీ సేవలందిస్తున్నాం. మారుమూల గ్రామాల్లో తల్లిదండ్రులకు దీనిపై అవగాహన లేక దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకు రాలేకపోతున్నారు. అటువంటి వారికి అవగాహన కల్పించి పిల్లలను ఈ కేంద్రాలకు తీసుకువచ్చేలా ప్రోత్సాహం అందిస్తున్నాం.

– పి.భానుమూర్తి,
సహిత విద్య సమన్వయ కర్త, పార్వతీపురం మన్యం జిల్లా

హమాలీల నిరసన



గుమ్మలక్ష్మీపురం ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

గుమ్మలక్ష్మీపురం: కొత్త కూలీ రేట్లు అమలు చేయాలని గుమ్మలక్ష్మీపురం ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ హమాలీలు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ వద్ద బుధవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. మండల హమాలీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మక ప్రసాద్, టి.గోపాల్ మాట్లాడుతూ సివిల్ సప్‌లైకార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీలకు 1 జనవరి 2022 నుంచి కొత్త కూలీ రేట్లు అమలు చేసేందుకు సివిల్ సప్‌లై కార్పొరేషన్ అంగీకరించినప్పటికీ, నేటికీ పెంచిన కూలీ రేట్లు ఇవ్వడం లేదని, కూలీల పీఎఫ్ ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తెలియజేయడం లేదన్నారు. సంవత్సరం పాటు పనిచేసిన హమాలీలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఇవ్వలేదని వాపోయారు. రిటైర్డ్ అయిన హమాలీలకు పీఎఫ్ నగదు నేటికీ చెల్లించలేదని, కొత్తగా చేరిన వారి పేర్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద నమోదు చేయడం లేదని అన్నారు. ఆయా సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సహదేవుడు, జి.రాము, ప్రకాష్, పోలన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వేతనదారుకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- డ్వామా పీడీ ఎం.రామచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

కురుపాం: ప్రతీ వేతనదారునికి ఉపాధిపని కల్పించటమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ ఎం.రామచంద్రరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన ఉపాధిహామీ ఏపీఓలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి ఉపాధి పని కల్పించాలని, వేతనదారుల బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. పనులకు వచ్చే వేతనదారుల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈనెల 10వ తేదీ నాటికి 252 గ్రామ పంచాయతీల్లో పనులు కల్పించి 85 లక్షల మ్యాన్ డేస్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో ఏపీడీ చంద్రమ్మ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి



గరుగుబిల్లి: సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి భాస్కరరావు



వీరఘట్టం: మాట్లాడుతున్న సర్పంచ్ రమాదేవి



పాలకొండ రూరల్: ఎం.సింగుపురం గ్రామసభలో అభివృద్ధి ప్రణాళికలు వివరిస్తున్న అధికారులు

వీరఘట్టం: గ్రామాభివృద్ధికి ప్రజలందరి సహకారం అవసరమని నడుకూరు సర్పంచ్ కర్రి రమాదేవి అన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి మధు, వీఆర్‌ఓ ఎం.సింహాచలం పాల్గొన్నారు.

- **గరుగుబిల్లి:** మండలంలోని గొట్టివలస గ్రామ పంచాయతీలో సర్పంచ్ బి.చంద్రినాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉపయోగపడే అభివృద్ధి పనులను గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు కార్యదర్శి టి.భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, వీఆర్‌ఓ ఆర్.రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.
- **పాలకొండ రూరల్:** అధికారులు, ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రమాదేవి అన్నారు. గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. వీధికాలువలు, సీసీరోడ్ల నిర్మాణం, తాగునీరు, ఉపాధి పనులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, వీఆర్వో అసరయ్య, కార్యదర్శి బి.సింహాచలం పాల్గొన్నారు. అలాగే గోపాలపురంలో సర్పంచ్ ఎస్.జగదీష్ అధ్యక్షతన, పొట్లిలో సర్పంచ్ జి.కృష్ణారావు నేతృత్వంలో గ్రామసభలు నిర్వహించారు.

గ్రామాల్లో 8 రకాల వైద్య పరీక్షలు

పార్వతీపురం టౌన్: గ్రామాల్లో ఎనిమిది రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని బందలుప్పి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అవసరమైన వారికి వైద్యపరీక్షలు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ 15రోజులకొకసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో 8రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని,రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



తుమరాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందని, సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఎంపీడీఓ డి.త్రినాథులు అన్నారు. మండలంలోని టి.కె.రాజపురం, గోపాలపురం, బుక్కూరు, తుమరాడ గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. పలుచోట్ల కార్యదర్శులు అందుబాటులో లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు, సచివాలయ సేవలపై ఆరాతీశారు.

బాలేరులో అన్నసంతర్పణ



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

భామిని: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని బాలేరు శ్రీరామ మందిరం వద్ద బుధవారం అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఇరుముడిధారణ



శబరిమల బయలుదేరి వెళ్తున్న అయ్యప్ప భక్తులు

భామిని: మండలంలోని సొలికిరి అయ్యప్ప దీక్షాపరులకు గురుస్వామి షణ్ముఖరాజు బుధవారం ఇరుముడిదారణ చేశారు. అనంతరం ఊరేగింపుగా శభరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప నామ స్మరణతో స్థానిక కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణం మార్మోగిపోయింది.

సీజనల్ వసతిగృహం ప్రారంభం



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పి.గంగమ్మ

పాచిపెంట: మండలంలోని కరకవలస పంచాయతీ అమ్మవలసలో నీడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వసతిగృహాన్ని స్థానిక సర్పంచ్ పెద్దింటి గంగమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వేణుగోపాలరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు వలస కార్మికుల కుటుంబాల పిల్లలను అన్ని రకాలుగా ఆదుకుని వారికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో సీజనల్ వసతిగృహాన్ని ప్రారంభించామన్నారు. వీరికి విద్యా బోధన చేసేందుకు ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక స్కూల్ హెచ్ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయుడు తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో బహుళ ప్రయోజనాలు



నైరా వ్యవసాయ కళాశాలలో విద్యార్థుల క్షేత్ర పర్యటన

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయి అధ్యయనం ద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని నైరా వ్యవసాయ కళాశాల పరిపాలనాధికారి అరుణ్ కుమార్ అన్నారు. పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా కార్యాలయ రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు బుధవారం నైరా కళాశాలకు బుధవారం తీసుకువెళ్లారు. విద్యార్థులకు క్యాష్ బుక్ నిర్వహణ, సిబ్బంది ఇన్‌కమ్ టాక్స్ పరిశీలన, బ్యాంక్ లావాదేవీలు వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ అందించినట్లు వృత్తివిద్యా కోర్సుల అధ్యాపకుడు వెలమల అప్పారావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వ్యవసాయ గిడ్డంగుల సముదాయం, ఆదాయపు పన్నుల శాఖ కార్యాలయంలో కార్యకలాపాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

వసతిగృహం సందర్శన



వసతి గృహంలో సరుకుల నిల్వను పరిశీలిస్తున్న ఐటీడీఏ డీడీ సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల సంక్షేమాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణ సూచించారు. గుమ్మలక్ష్మీపురం డిగ్రీ, జూనియర్ కళాశాల బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆయన సందర్శించారు. భోజన మెనూతో పాటు స్టాక్ నిల్వలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వసతిగృహంలో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని సంక్షేమాధికారి భాగ్యలక్ష్మికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షల టైం టేబుల్ విడుదలైన నేపథ్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం 60 రోజుల ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో అమలు చేస్తామన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



సీతంపేట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- ఘనంగా పింఛన్ కానుక వారోత్సవాలు

సీతంపేట: అర్హులైన పేదలందరికీ పింఛన్లు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో ఆమె పాల్గొని పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సంకల్ప పాదయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నారన్నారు. మూడో విడతలో రూ.2500 ఉన్న పింఛన్ మొత్తాన్ని రూ.2750లకు పెంచినట్లు చెప్పారు. గడచిన మూడున్నరేళ్లలో 30 లక్షల మందికి పైగా కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు. పింఛన్లు తొలగించారని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆరు నెలలకు ఒకసారి పింఛన్లపై సోషల్ ఆడిట్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందని, అందులో భాగంగానే అధికారులు కొంతమంది లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, వారు ఇచ్చిన వివరణ ఆధారంగా వారికి పింఛన్లు పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్డీ సత్యం, ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీలు కె.సరస్వతి, ఎం.విజయలక్ష్మి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బి.సరోజిని, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

భామిని: పేదరిక నిర్మూలనలో భాగంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామినిలో కొత్తగా పింఛన్ మంజూరైన 174 మంది లబ్ధిదారులకు బుధవారం జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మితో పింఛన్ అందజేశారు. లబ్ధిదారులు జగనన్నకు జేజేలు పలుకుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సర్పంచ్ ఎం.మోహన్‌బాబు, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీలు బిడ్డిక తులసి, టింగ అన్నాజీరావు, కె.చిరంజీవులు, నిమ్మల నిబ్బరం, ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఏపీఎం దొడ్ల భవానీ, హౌసింగ్ ఏఈఈ బొంగు అప్పలనాయుడు, సర్పంచ్‌లు తొగరాన శ్రీను, జామి బైరాగి, మడపాన కేశవ, భార్గవనాయుడు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత

భామిని: మండలంలోని ఘనసరకు చెందిన వరలక్ష్మి అనారోగ్యంతో విశాఖపట్నం అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ గండి రాము బుధవారం విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేశాడు. అలాగే భామినికి చెందిన వృద్ధురాలు లోపింటి పారమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పాలకొండ బంధువుల వద్ద ఉంటుండడంతో వలంటీర్ లోపింటి సంధ్యారాణి పాలకొండ వెళ్లి పింఛన్ అందజేసింది.

ఎమ్మెల్యే పరామర్శ

వీరఘట్టం: మండలంలోని అడారు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం సత్యంనాయుడు మనవరాలు ఇటీవల మృతి చెందింది. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి బుధవారం సత్యంనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ అయిన సుధారాణి, గణపతినాయుడు దంపతులను ఓదార్చారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



భామిని: సీఎం జగనన్నకు జేజేలు పలుకుతున్న ఎమ్మెల్యే కళావతి, పింఛన్‌దారులు



భామిని: విశాఖలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు వరలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాము